# యూనిట్ I

## 3. పిల్లలం

– ఏటుకూరి ప్రసాద్

**ఆలోచించండి-మాట్లాడండి**



**ప్రశ్నలు:**

1. చిత్రాన్ని చూశారా? చిత్రంలో ఎవరెవరున్నారు?
2. వారేం చేస్తున్నారు?
3. వారి ప్రవర్తన, స్వభావం ఎలా ఉంటుంది?
4. వారికి ఏమంటే ఇష్టం? ఏం చేస్తుంటారు?

**ఉద్దేశం:** ఆటపాటలతో కాలం గడుపుతూ, కల్లాకపటం, మాయామర్మం తెలియని అమాయకపు పసిపిల్లల నిష్కల్మష స్వభావాన్ని, ఇష్టాలను తెలియజెప్పడం పాఠం ఉద్దేశం.
ప్రస్తుత పాఠ్యభాగాన్ని "సుప్రసిద్ధ గేయాలు – పాటలు" అనే గేయసంపుటినుంచి తీసుకొన్నారు. ఈ గేయ రచయిత ఏటుకూరి ప్రసాద్.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.





పిల్లలం పసిపిల్లలం
ముసిముసి నవ్వుల జల్లులం
విచ్చే రేపటి పూవులం
అరవిచ్చినట్టి చిరునవ్వులం ॥పిల్ల॥ 1

నల్లా తెల్లా ఎల్లా గున్నా
అందరు ఒకటను వాళ్ళం
గొప్పా బీదా భేదాలంటే
ఒప్పని మనసుల వాళ్ళం ॥పిల్ల॥ 2

మనుషుల మంతా ఒకటంటే చిరు
నవ్వుతో బహుమానిస్తాం
రంగుల భేదం ఉందంటే – ఛీ
ఛీ అని అవమానిస్తాం ॥పిల్ల॥ 3



కల్లా కపటం కల్తీ మోసం
అంటే గిట్టనివాళ్ళం
తెల్లనివన్నీ పాలని నమ్మీ
చెడు తలపెట్టనివాళ్ళం ॥పిల్ల॥ 4

కాయాకష్టం చేసేవారి
కలల ప్రతిరూపాలం
మాయా మర్మం ఊసేఉండని
నవలోకపు దీపాలం ॥పిల్ల॥ 5





హాయి గొల్పుతూ
మేలుకొల్పుతూ
గిళ్ళపాడు సన్నాయిలం
కలయ దిరుగుతూ కళ్ళయెదుట, తు
ళ్ళింతలాడు తువ్వాయిలం ॥పిల్ల॥ 6

పిల్లలమండీ పిల్లలము
తెల్లగ విచ్చిన మల్లెలము
కల్లాకపటం ఎరుగని తెల్లని
మనసులున్న పసిపిల్లలము ॥పిల్ల॥ 7

నిరాశ చీకటి నిండిన ఇళ్ళకు
ఆశల మణిదీపాలం
నవ్వుల పువ్వులు రువ్వుచు తుర్రున
తిరిగే చక్కని గువ్వలం ॥పిల్ల॥ 8

కోపం, తాపం, మోసం, ద్వేషాల్
మనిషి మనసులకు మానని గాయాల్
చల్లనైన మాటలను జల్లి
ఉల్లాసపర్చు పసివైద్యులం ॥పిల్ల॥ 9

మంచువంటి మాటలతో ప్రజల ప్రే
మించు టెట్లో నేర్పించెదం
వంచక కీచక లంచగొండులను
మంచిమార్గముకు తిప్పెదం ॥పిల్ల॥ 10

రాయీ రప్పా మట్టీ బెడ్డకు
మొక్కే తల్లుల పిల్లలం
ఆయా పనులకు అర్థాలడుగుతు
ఆలోచించే పిల్లలం ॥పిల్ల॥ 11

వాడూ వీడను భేదాలుండని
నవలోకపు నిర్మాతలమూ
చేయీ చేయీ కలిపి అందరికి
హాయిని పంచే పసిపిల్లలమూ ॥పిల్ల॥ 12

### సారాంశం

1. మేమంతా పిల్లలం. చిన్న పిల్లలం. మేం ముసిముసి నవ్వులు జల్లుల్లా కురిపిస్తాం. ఇంకా చెప్పాలంటే ఆ జల్లులం మేమే. ఈ రోజు మొగ్గలుగా ఉన్న మేం రేపటికి విచ్చుకునే పూవులం. మేం అరవిరిసిన చిరునవ్వులమే!
2. ఒంటి రంగు నలుపైనా, తెలుపైనా అందరం ఒక్కటే అంటాం. బీదవారు, గొప్పవారు అనే తేడాలు మా మనసుకు అసలేనచ్చదు.
3. 'మానవులందరూ ఒక్కటి' అనే వాళ్ళకు చిరునవ్వు బహుమతిస్తాం. రంగులను బట్టి తేడా చూపితే ఛీకొట్టి అవమానిస్తాం.
4. కల్లాకపటం మాకు తెలియదు. కల్తీలు, మోసాలు మేం చేయం అవన్నీ మాకు నచ్చవు. 'తెల్లగా ఉండేవన్నీ పాలు' అని మేం నమ్ముతాం. ఎప్పుడూ, ఎవరికీ, ఏ హానీ మేం చేయబోం.
5. కాయాకష్టం చేస్తూ మమ్మల్ని పోషించే కన్నవాళ్ళ కలలు నిజాలు చేయాలని చూసే వాళ్ళం. మాయలూ, మర్మాల మాటే లేని కొత్తలోకాన్ని చూపెట్టే దీపాలం.
6. హాయిని కల్గిస్తూ మేల్కొల్పుపాటలు పాడేసన్నాయిలం. అంతటా కలియ తిరుగుతుండి తుళ్ళిపడే లేగదూడలం.
7. పిల్లలమండీ! మేం పిల్లలం! విరిసిన మల్లెపూవుల్లా తెల్లగా నవ్వుతాం. కల్లాకపటం మాకు తెలియదు. మాది తెల్లని మనసు.



8. నిరాశ అనే చీకట్లో మునిగిన ఇండ్లలో ఆశలనే వెలుగుల్ని నింపే మణిదీపాలం మేం. నవ్వుల పువ్వులు వెదజల్లుతాం. తుర్రుమంటూ ఎగుర్తూపోయే గువ్వ పిల్లలం మేము.
9. మాకు కోపం రాదు. తాపం (బాధలు) లేదు. మోసం చేయం. ద్వేషాన్ని చూపించం. ఈ లక్షణాలన్నీ మానవుల మనసులకు గాయాలు చేస్తాయి. ఆ గాయాల్ని మా చల్లని మాటలని చల్లి మాన్పివేస్తాం. గాయపడినవారిని ఉల్లాస పరుస్తూ వైద్యులమైపోతాం.
10. మంచులా చల్లని మాటల్తో తోటివారినెలా ప్రేమించాలో నేర్పిస్తాం. మోసగాళ్ళను, కీచకులను, లంచగొండులను మంచిమార్గానికి తిప్పేస్తాం / మళ్ళిస్తాం.
11. సంతానం లేదని బాధపడ్తూ కనిపించిన రాయికీ, రప్పకూ మొక్కుతూ ఆరాటపడే తల్లులకు కన్న పిల్లలం. వారు చేసే ప్రతిపనికీ అర్థాలను అడిగి, ఆలోచింప చేస్తూ, ఆలోచించే పిల్లలం.
12. మాదో కొత్తలోకం. అక్కడ వాడు, వీడు అనే తేడాలుండవు. అంతా మనవాళ్ళే. చేయీ చేయీ కలుపుతాం. అందరికీ హాయిని పంచుతాం మేమంతా పిల్లలం, చిన్న పిల్లలం.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. 'పిల్లలం' – గేయాన్ని రాగంతో అభినయంతో పాడండి.
2. పాఠంలో మీకు నచ్చిన గేయభాగం ఏది? దాన్ని చదివి భావం చెప్పండి.
3. పసిపాపల ప్రవర్తన పెద్దవారిలో మార్పులను కల్గిస్తుందా?
4. పసిపాపల దినచర్యలను చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. మీ పాఠంలో వచ్చిన నల్లా తెల్లా, గొప్పా బీదా వంటి జంట పదాలున్నాయి. పాఠం చదివి ఇటువంటి పదాలను తీసిరాయండి.

అ) ____________ ఉ) ____________

ఆ) ____________ ఊ) ____________


ఇ) ____________ ఋ) ____________

ఈ) ____________ ఎ) ____________



© SCERT not to be republished

**2. కింది గేయ భావాన్ని చదివి ప్రశ్నలను తయారుచేయండి.**




కోపం తాపం మోసం ద్వేషాల్
మనిషి మనసులకు మానని గాయాల్
చల్లనైన మాటలను జల్లి
ఉల్లాసపరుచు పసివైద్యులం॥

అ) ______

ఆ) ______

ఇ) ______

ఈ) ______



**3. పాఠ్యాంశాన్ని చదివి కింది ఖాళీలను పూరించండి.**

అ) అరవిచ్చినట్టి ______.

ఆ) నవలోకపు ______.

ఇ) తుళ్ళింతలాడు ______.

ఈ) తెల్లని మనసులున్న ______.

ఉ) తుర్రున తిరిగే చక్కని ______.

ఊ) ఉల్లాసపర్చు ______.

ఋ) ఆలోచించే ______.

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు తగిన జవాబులు రాయండి.**



అ) పిల్లలు ఎలాంటి మనసు కలవాళ్ళని రచయిత తెలిపాడు?

ఆ) పిల్లలు ఎలా వైద్యులుగా మారతారు? వారెలా వైద్యం చేస్తారు?

ఇ) పిల్లలు ప్రజలను ఎలా ప్రేమిస్తారు? దుర్మార్గులను ఎలా మంచి మార్గానికి మళ్ళిస్తారు?

ఈ) పిల్లల లోకం ఎలాంది? అక్కడి వాళ్ళు ఎలా ఉంటారు?

ఉ) గాయపడిన పెద్దల మనసులకు పిల్లలు ఎలా ఊరటకలిగిస్తారు?



## III. స్వీయరచన



**1. కింది వాటికి ఐదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) పిల్లలు 'విచ్చే రేపటి పూవులు' అని రచయిత అన్నాడు కదా! అలా ఎందుకు అని ఉంటాడు?

ఆ) పిల్లలు పెద్దల ప్రవర్తనను ఎలా స్వీకరిస్తారో రాయండి?

ఇ) ఇదే గేయానికి మీరు ఒక మంచి పేరు పెట్టండి. ఆ పేరు ఎందుకు పెట్టారో రాయండి.

ఈ) మీరు పసిపిల్లలుగా ఉన్నప్పుడు మీ ప్రవర్తన ఎలా ఉండేదో జ్ఞాపకం తెచ్చుకొని రాయండి.

**2. కింది వాటికి పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) పసిపిల్లల నిష్కల్మషమైన ప్రవర్తనను, వాళ్ళ భావాలను తెల్పండి.

ఆ) సంస్కరణ భావాలుగల పిల్లలుగా మీరు సమాజాన్ని ఎలా మార్చడానికి ప్రయత్నిస్తారో ఊహించి రాయండి.

## IV. పదజాలం



**1. కింది పదాలు ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ) నవ్వుల జల్లు : ______

ఆ) బహుమానం : ______

ఇ) కల్లా కపటం : ______


ఈ) కాయ కష్టం : ______

ఉ) ప్రతిరూపాలు : ______

ఊ) సన్నాయి : ______

ఋ) మానని గాయం : ______


ఎ) లంచగొండ్లు : ______



**2. మీ పాఠంలో 'లం' అవే అక్షరంతో పూర్తయ్యే పదాలున్నాయి. వాటిని రాయండి. మరికొన్ని కొత్త పదాలు రాయండి.**


ఉదా: పిల్ల లం

( i ) ______
( ii ) ______
( iii ) ______
( iv ) ______
( v ) ______




( vi ) ______
( vii ) ______
( viii ) ______
( ix ) ______





**3. కింది పదాలకు వ్యతిరేక భావం గల పదాలను రాయండి.**

ఉదా: నవ్వు × ఏడ్పు

అ) అవమానం × ______

ఆ) భేదం × ______

ఇ) కపటం × ______


ఈ) చెడు × ______

ఉ) నిరాశ × ______

ఊ) చీకటి × ______

**4. కింది గడిలో ఉన్న అక్షరాలను వాడుకొని వీలైనన్ని ఎక్కువ పదాలను రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| జ | పూ | తు | లు | మే | ఆ | వై |
| మ | మ | హో | ల్లు | ళ్ళిం | ల్తీ | యి |
| రం | న | గు | త | లు | వ్వు | మో |
| క | వు | సు | ర్మం | టం | ల | శ |
| క | పు | ప | ట | యి | ల్లి | లు |
| చె | పా | మం | క | చ | ర్మా | సం |
| మా | ద్యు | టం | డు | రా | కు | ర్గం |
| క్రీ | త | య | ని | చు | చే | త |



ఉదా : కీలు

అ) ______ ఆ) ______ ఇ) ______ ఈ) ______

ఉ) ______ ఊ) ______ ఋ) ______ ఎ) ______

ఏ) ______ ఐ) ______ ఒ) ______ ఓ) ______

ఔ) ______ అం) ______ అః) ______ క) ______

**5. కింది వాక్యాల ఆధారంగా గీతగీసిన పదాలకు అర్థాన్ని రాయండి.**

ఉదా: చిన్న పిల్లలు మంచి పనులు చేస్తే పెద్దవాళ్ళు <u>బహుమతులు</u> ఇస్తారు.

బహుమతి = కానుక.

అ) వాన వచ్చేముందు చిరు<u>జల్లులు</u> కురుస్తాయి.

జల్లులు = ______



ఆ) ఎవరినైనా మనం <u>అవమానిస్తే</u> వాళ్ళు బాధపడతారు.

అవమానం = ______

ఇ) <u>కల్ల</u> మాటలు మాట్లాడవద్దు.

కల్ల = ______

ఈ) పసిపిల్లలు పెద్దవాళ్ళ ఆశలకు <u>ప్రతిరూపాలు</u>.

ప్రతిరూపాలు = ______

ఉ) ఆటలాడుతూ కిందపడ్డ పిల్లలకు <u>గాయాలు</u> అయినాయి.

గాయాలు = ______

## V. సృజనాత్మకత



**ఈ గేయ భావం స్ఫురించేలా ఒక చిత్రాన్ని గీయండి. దానికి రంగులు వేయండి. ఆ చిత్రానికి ఆలోచింపజేసే పేరు పెట్టండి. చిత్రాన్ని గురించి రెండు వాక్యాలు రాయండి.**

## VI. ప్రశంస



**మీకు తెల్సిన చిన్నపిల్లల వద్దకు వెళ్ళినప్పుడు వాళ్ళు ఆనందంగా ఉండడానికి మీరేం చేస్తారో రాయండి.**

## VII. భాషాంశాలు



**1. కింది పదాలను విడదీయండి.**

అ) ఉదా: రామానుజుడు = రామ + అనుజుడు = (అ + అ = ఆ)

1) రామాలయం = ______ + ______ = (        )

ఆ) ఉదా: కవీంద్రుడు = కవి + ఇంద్రుడు = (ఇ + ఇ = ఈ)


1) కవీశ్వరుడు = ______ + ______ = (        )

ఇ) ఉదా: భానూదయం = భాను + ఉదయం = (ఉ + ఉ = ఊ)

1) వధూపేతుడు = ______ + ______ = (        )

ఈ) ఉదా: పితౄణం = పితృ + ఋణం = (ఋ + ఋ = ౠ)

1) మాతౄణం = ______ + ______ = (        )





© SCERT not to be republished

అ – ఇ – ఉ – ఋ అనే వర్ణాలకు అవే వర్ణాలు (సవర్ణాలు) కలిసినప్పుడు దీర్ఘం తప్పనిసరిగా రావడాన్ని **‘సవర్ణదీర్ఘ సంధి’** అంటారు.

ఈ విధంగా సంస్కృత పదాల మధ్య జరిగే సంధులను సంస్కృత సంధులు అంటారు.

## 2. కింది పదాలను విడదీయండి.

ఉదా: విద్యార్థి = విద్యా + అర్థి = (ఆ + అ = ఆ)

అ) మహేంద్రుడు = ______ + ________ = (          )

ఆ) కోటీశ్వరులు = ______ + ________ = (          )

ఇ) సువర్ణాధ్యాయం = ______ + ________ = (          )

ఈ) కరీంద్రం = ______ + ________ = (          )

ఉ) సమరాంగణం = ______ + ________ = (          )

ఊ) శుభారంభం = ______ + ________ = (          )

ఋ) కవీంద్రులు = ______ + ________ = (          )

## 3. కింది పదాలను విడదీసి అవి ఏ సంధులో గుర్తించండి.

అ) హితార్థులు = __________ + __________ (          )

ఆ) భానూదయం = __________ + __________ (          )

ఇ) దేవాలయం = __________ + __________ (          )

## 4. కింది పదాలను కలిపి రాయండి.

అ) జగంబు + ఆపోవ = __________ (          )

ఆ) పాంతటలు + ఉన్నను = __________ (          )

ఇ) కర + అగ్రము = __________ (          )

ఈ) ఇనకుల + అధిపుడు = __________ (          )

## 5. కింది పదాలను విడదీయండి.

ఉదా: అతడెక్కడ = అతడు + ఎక్కడ ; (డ్ + ఉ) + అ = డ

మనమున్నాము = __________ ; __________

ఎవరిచ్చారు = __________ ; __________

మొదటి పదముల చివర ఉన్న హ్రస్వ ఉకారానికి (ఉత్తు, మొదటి ఉ) అచ్చు కలిసినపుడు ‘ఉ’ కారంలోపించి ‘అ’ మిగులుతుంది. దీన్నే ‘ఉత్వ సంధి’ అంటారు.

ఉత్తుకు అచ్చు పరమైనప్పుడు సంధి నిత్యం – (నిత్యం అంటే తప్పకుండా జరుగుతుంది అని అర్థం).



## 6. కింద పదాలు కలిగినప్పుడు జరిగే మార్పును చర్చించండి.

ఉదా: మనుషులము + అంతా = (మ్ + ఉ) + అ = మ= మనుషులమంతా

అ) మనసులు + ఉన్న = __________

ఆ) అర్థాలు + అడుగుతూ = __________

ఇ) పిల్లలం + అండీ = __________

ఈ) భేదాలు + ఉండని = __________

## ప్రాజెక్టు పని

కొన్ని వార–దిన–మాస పత్రికలలో ‘బాలగేయాలు’ ప్రచురిస్తూ ఉంటారు. వాటిలో మీకు నచ్చిన కవితలను సేకరించి సంపుటిగా తయారుచేసి వాటిని చదివి అట్లాగే మీరు బాలగేయాలను రాసి, ఉపాధ్యాయునికి చూపించి గోడపత్రికలో ప్రదర్శించండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని లయబద్ధంగా, అభినయంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. | గేయంలోని భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. రాయగలను. | ఔను / కాదు |
| 3. | గేయంలోని పదాలతో సొంతవాక్యాలు రాయగలను. | ఔను / కాదు |
| 4. | గేయం భావానికి అనుగుణంగా చిత్రంగీసి, రంగులు వేయగలను. | ఔను / కాదు |

*“పిల్లలూ, దేవుడూ చల్లనివారే,*
*కల్లకపటమెరుగని కరుణామయులే”*



©SCERT not to be republished